

ఎమ్మెల్యే తలసానిని కలిసిన కుమార్ యాదవ్

యాదవుల అభివృద్ధికి కృషి చేయాలి

బేగంపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): యాదవుల అభివృద్ధి, హక్కుల సాధన కోసం కృషి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఇటీవల సనత్‌నగర్ నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన కుమార్ యాదవ్, పలువురు యాదవ సంఘం నేతలు గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో తలసానిని కలిశారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్‌ను తలసాని సన్మానించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు రాములు యాదవ్, సత్యనారాయణ యాదవ్, బాలేష్‌యాదవ్, శ్రీకాంత్‌యాదవ్ పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాల రద్దు.. పునరుద్ధరణ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కుల ధ్రువీకరణ పత్రాల జారీపై ఫిర్యాదులు రావడంతో జిల్లాస్థాయి పరిశీలన కమిటీ విచారణ అనంతరం చేసిన సిఫార్సుల మేరకు ఒక కమ్యూనిటీ సర్టిఫికెట్ రద్దు, మరోదానిని పునరుద్ధరిస్తూ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నోటిఫికేషన్ జారీ చేశారు. ఖైరతాబాద్ తహసీల్దార్ 2022లో జారీ చేసిన ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేయడంతోపాటు ముషీరాబాద్ తహసీల్దార్ 2023లో ఇచ్చిన ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాన్ని పునరుద్ధరిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి

బేగంపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27వ తేదీన వరంగల్‌లో నిర్వహించ తలపెట్టిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం బీఆర్ఎస్ పార్టీ బేగంపేట డివిజన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్క బీఆర్ఎస్ కార్యకర్త ఈ సభలో పాల్గొనాలన్నారు. అమలు కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. 15 నెలలకే ప్రజలు కాంగ్రెస్ పాలనపై విసుగుచెందారన్నారు. తొలుత ఇటీవల మరణించిన బీఆర్ఎస్ సీనియర్ నేత సత్యనారాయణకు సంతాపం తెలిపారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు డి.వి.నరేందర్‌రావు, టి.శ్రీహరి, పాటిగడ్డ గిరి, శ్యామ్ సుందర్, మొయినుద్దీన్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



కేరళలో జరిగిన ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్-2025లో టేబుల్ టెన్నిస్ పోటీలో డబుల్స్-మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో రెండు కాంస్య పతకాలు సాధించిన వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌ను అభినందిస్తున్న ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది

● బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి



బాస్కెట్ బాల్ జట్టు

బాస్కెట్‌బాల్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలో జరిగిన 40వ జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో తెలంగాణ అండర్-16 బాస్కెట్ బాల్ జట్టు సత్తా చాటింది. దేశంలోని 29 రాష్ట్రాల నుంచి వచ్చిన జట్లతో తెలంగాణ జట్టు దీటుగా తలపడి టాప్-4లో నిలిచిందని జట్టు కోచ్‌లు సంతోష్, పంకజ్, అమృత్ తెలిపారు. బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించిన ఈ పోటీల్లో అగ్రశ్రేణి జట్లుగా ఉన్న ఢిల్లీ, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ జట్లను ఓడించిన తెలంగాణ జట్టు అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచిందని కోచ్‌లు తెలిపారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ తెలంగాణ బాస్కెట్ బాల్ జట్టులో ఉన్నారని వారు తెలిపారు.



రూప్లానాయక్‌ను అభినందిస్తున్న అనిల్ కుమార్

విధులతో పాటు క్రీడల్లో రాణిస్తే ప్రోత్సాహం

పంజాగుట్ట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విధులతో పాటు క్రీడల్లో రాణిస్తున్న వారిని ప్రోత్సహిస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్(అడ్మిన్) అనిల్ కుమార్ అన్నారు. ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలో బంగారు, వెండి పతకాలు సాధించిన జగదేవపూర్ ఇరిగేషన్ డివిజన్ నెంబర్.8 డీఈఈ రూప్లానాయక్‌ను ఆయన గురువారం ఎర్రమంజిల్ జలసౌధలోని తన ఛాంబర్‌లో అభినందించారు. గతంలో చండీఘర్‌లో నిర్వహించిన(ఏఐసీఎస్) ఓపెన్ కేటగిరి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్లో కూడా అత్యుత్తమ ప్రదర్శనతో మెడల్స్ సాధించారని అనిల్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఉద్యోగులు, ఇంజనీర్ల సంఘం నాయకులు నూనె శ్రీధర్, శ్రీకృష్ణ పుష్కర్, ప్రకాష్, బండి శ్రీనివాస్, మనోహర్, మహేంద్రనాథ్ పాల్గొన్నారు.

రేపు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ సంస్మరణ సభ

పంజాగుట్ట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అభినవ అన్నమయ్య, టీటీడీ ఆస్థాన విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ ఆత్మీయ సంస్మరణ సభ ఈనెల 19న కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామని ఆయన శిష్యులు, అభిమానులు తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన కుమారుడు గరిమెళ్ల అనిల్ కుమార్ శిష్యులు నర్సింహులు, మంగళపల్లి, నిహాల్, సునీత, బాలాజీ, వేణు, శ్రీరంగం, శ్రీవిద్యాభారతితో కలిసి వివరాలు వెల్లడించారు. గత నెల 9న గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్(76) తిరుపతిలో మృతిచెందారని తెలిపారు. వెయ్యికి పైగా అన్నమయ్య కీర్తనలను స్వరపరిచి వెలుగులోకి తెచ్చారని, ఆరు వేలకు పైగా కచేరీలు చేశారని అన్నారు. వినరో భాగ్యము విష్ణుకథ, పిడికిట తలంబ్రాల పెండ్లి కూతురు, జగడపు చనువుల జాజర వంటి కీర్తనలు ఆయనకు ఎంతో గుర్తింపు తెచ్చాయని అన్నారు. కంచి కామకోటి పీఠం, అహోబిల మఠం ఆస్థాన సంగీత విద్వాంసులుగా సేవలందించారని, హరి సంకీర్తన ద్వారా ఎందరో శిష్యులను తీర్చిదిద్దారని తెలిపారు. సమావేశంలో గరిమెళ్ల శిష్య ప్రశిష్య బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

'తాగునీరు రోడ్డుపాలు'పై కదిలిన అధికారులు

మోతినగర్ ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మోతినగర్ ప్రధాన కూడలి వద్ద ఆరు నెలల నుంచి తాగునీరు పైప్‌లైన్ నుంచి లీక్ అవుతుంది. ఈ విషయమై గురువారం 'మోతీనగర్‌లో తాగునీరు రోడ్డు పాలు' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైనది. దీనికి జలమండలి అధికారులు స్పందించారు. జలమండలి జనరల్ మేనేజర్ హరిశంకర్ ఆధ్వర్యంలో పలువురు అధికారులు, సిబ్బంది తాగునీరు లీక్ అవుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేపట్టారు. లీక్ అవుతున్న ప్రాంతంలో గుంత తీశారు. నిర్మాణ పనులు చేపట్టేందుకు ఆ ప్రాంతంలో చెట్టు, భూగర్భ విద్యుత్ లైన్‌లు ఉండడంతో పనులు ముందుకు సాగలేదు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని త్వరితగతిన పనులు పూర్తి చేసినట్లు జలమండలి అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం వాహబ్, మేనేజర్ ప్రేమ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ షకిల్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నిర్మాణ పనులు చేపడుతున్న జలమండలి అధికారులు

వాంబే ఇళ్ల స్థానంలో..

అక్రమంగా బహుళ అంతస్థుల భవనం

క్రమబద్ధీకరణ కాకపోవడంతో కూల్చివేత

బంజారాహిల్స్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పేదలకు వాంబే పథకం కింద నిర్మించిన ఇళ్లను అక్రమంగా కొనుగోలు చేయడమే కాకుండా వాటి స్థానంలో జరుగుతున్న బహుళ అంతస్థుల భవనాన్ని రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ఫిలింనగర్ గౌతమ్‌నగర్‌లో వాంబే పథకం కింద అప్పట్లో ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం చేపట్టి ఇచ్చింది. ఇందులో రెండు పట్టాలను అక్రమంగా లబ్ధిదారుల నుంచి బంజారాహిల్స్ ఎన్‌బీటీనగర్‌కు చెందిన బీజేపీ నాయకుడు వెంకట్‌రెడ్డి తన భార్య నర్మద పేరిట కొనుగోలు చేశాడు. దీని పక్కనే ఉన్న మరో 105 గజాల స్థలం కూడా తనదేనంటూ వెంకట్‌రెడ్డి చెప్పుకుంటూ వచ్చాడు. వాంబే ఇళ్లను తొలగించి బహుళ అంతస్థుల నిర్మాణాలు చేపట్టాడు. పేదలకు అప్పుగా డబ్బు ఇచ్చి వాటికి వడ్డీ కలిపి వెంకట్‌రెడ్డి స్థలాలను లాక్కున్నాడని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అసెంబ్లీలో మాట్లాడారు. అంతేగాకుండా ఈ వ్యవహారంపై దృష్టి సారించాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. దీంతో రెవెన్యూ అధికారులు నాలుగు రోజుల క్రితం విచారణ చేపట్టి అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నాయని గుర్తించారు. షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి ఆదేశాల మేరకు సిబ్బంది అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.



అక్రమ నిర్మాణాన్ని కూల్చిన రెవెన్యూ అధికారులు

ఈడీ కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ నాయకులు



బోరబండ నుంచి కాంగ్రెస్ కార్యకర్తలతో వెళ్తున్న కార్పొరేటర్ బాబాఫసియుద్దీన్



ఈడీ కార్యాలయం ఎదుట నిర్వహించిన ర్యాలీలో టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీహెచ్ తదితరులతో రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి

బోరబండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై అక్రమంగా ఈడీ కేసులు పెట్టారని బోరబండ కార్పొరేటర్ ఎం.డి.బాబాఫసియుద్దీన్ విమర్శించారు. ఇందుకు నిరసనగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ ఇచ్చిన పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి బోరబండ కమాన్ నుంచి బస్సులో ఈడీ కార్యాలయానికి గురువారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి అశోక్, పలు బస్తీల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రహ్మత్‌నగర్ నుంచి..

నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ చార్జ్‌షీట్‌లో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ పేర్లు చేర్చినందుకు నిరసనగా ఈడీ కార్యాలయం ముట్టడికి రహ్మత్‌నగర్ డివిజన్ నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, తదితరులు ఉన్నారు.



ఈడీ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ

ప్రతిపక్షాలను అణిచి వేసేందుకే కేసులు..

బేగంపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కడమే కేంద్ర ప్రభుత్వం పరిపాలనగా సాగుతోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ విమర్శించారు. ఈడీ కార్యాలయం వద్ద గురువారం జరిగిన ధర్నాలో ఆమె పాల్గొన్నారు.

వాహనాలపై ఫైనాన్స్ తీసుకొని మరొకరికి అమ్మి మోసం

కోర్టు ఆదేశాల మేరకు తపస్వీ ఆటోమేషన్ నిర్వాహకులపై కేసులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వాహనాలపై ఫైనాన్స్ తీసుకొని వాటిని మరొకరికి అమ్మి డబ్బులు వసూలు చేసిన తపస్వీ ఆటోమేషన్ నిర్వాహకులపై కోర్టు ఆదేశాల మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసులు నమోదు చేశారు. మల్కాజిగిరికి చెందిన డి.శ్రీనివాస్ ఆటో డ్రైవర్. సాగర్‌సొసైటీలోని తపస్వీ ఆటోమేషన్ కార్పొరేషన్ కంపెనీలో ఓ ఆటో కొనుగోలు చేశాడు. సంస్థ నిర్వాహకులు ఎన్.హనుమంతరావు, నాగేశ్వరరావు ఆటోలపై ఫైనాన్స్ ఉందని ప్రతీ నెల ఈఎంఐ తమకు చెల్లిస్తే ఫైనాన్స్ సంస్థకు తాము కడతామని చెప్పారు. ఈ మేరకు శ్రీనివాస్ ప్రతీ నెల ఈఎంఐ చెల్లిస్తూ వచ్చాడు. ఇలా రూ.2.50 లక్షలు చెల్లించాడు. కానీ, ఫైనాన్స్ సంస్థ తమకు డబ్బు ముట్టలేదని లీగల్ నోటీసు ఇచ్చారు. దీంతో శ్రీనివాస్ తపస్వీ సంస్థకు వెళ్లి ప్రశ్నించగా వారు స్పందించలేదు. దీంతో బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, డబ్బు వివాదం తలదూర్చలేమని స్పష్టం చేశారు. బాధితుడు కోర్టును ఆశ్రయించడంతో వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి తపస్వీ ఆటోమేషన్ కార్పొరేషన్ సంస్థ నిర్వాహకులు ఎన్.హనుమంతరావు, నాగేశ్వరరావుపై బీఎన్ఎస్ 420, 491, 506 కింద కేసులు నమోదు చేశారు. శ్రీనివాస్‌ను మోసం చేసిన విధంగానే తపస్వీ సంస్థ గిరిరాజు చంద్రమౌళికి కూడా ఆటో అమ్మి రూ.3.50 లక్షలు వసూలు చేసి ఆ డబ్బును ఫైనాన్స్ చెల్లించలేదు. గిరిరాజు కూడా కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకు తపస్వీ సంస్థ నిర్వాహకులపై బంజారాహిల్స్ పోలీసులు మరో కేసు నమోదు చేశారు.

రెచ్చిపోయిన సైబర్ నేరగాళ్లు

● బంజారాహిల్స్‌లో మూడు కేసులు నమోదు

బంజారాహిల్స్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు రెచ్చిపోయారు. ముగ్గురిని మోసం చేశారు. చాంద్రాయణగుట్టకు చెందిన మహ్మద్ ఫయాజుద్దీన్ బంజారాహిల్స్‌లోని ఓ సంస్థలో సేల్స్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 13న ఇన్‌స్టాగ్రామ్ చూస్తుండగా స్క్రీన్ షాట్ తీసుకొని టాస్క్ పూర్తి చేస్తే డబ్బులు వస్తాయంటూ ఓ ప్రకటన చూసి ఆకర్షితుడయ్యాడు. ఈ మేరకు అందులో ఉన్న లింక్ ద్వారా రిజిస్టర్ అయి రెండు టాస్క్‌లు పూర్తి చేశారు. ఇందుకుగాను రూ.5,500 రాగా వాటిని తీసుకునేందుకు డబ్బులు కట్టాలని సైబర్ నేరగాళ్లు చెప్పారు. ఈ మేరకు పలు దఫాలుగా రూ.20వేలు చెల్లించాడు. చివరి దశలో రూ.50 వేలు కట్టాలని సైబర్ నేరగాళ్లు అడగడంతో అనుమానం వచ్చి తన డబ్బు తిరిగి ఇచ్చేయాలని కోరాడు. కాల్ కట్ చేయడంతో మోసపోయినట్టు గ్రహించి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరో కేసులో..

బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.14 నందినగర్‌లో నివసించే గాజుల వెంకటేష్ నౌషా బార్‌లో ఆపరేషన్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 14న ఆయనకు వాట్సాప్ మెసేజ్ వచ్చింది. టెలిగ్రామ్‌లో పార్ట్ టైం ఉద్యోగం ఉన్నట్టు దాని సారాంశం. ఆ లింక్ ద్వారా వాడి క్రియేట్ చేసుకున్నాడు. డబ్బులు పెట్టి కొన్ని వస్తువులు కొనుగోలు చేస్తే సాయంత్రంకి పెట్టుబడి తో పాటు లాభం తిరిగి ఇస్తామని సైబర్ నేరగాళ్లు చెప్పారు. నమ్మిన తను రూ.75,900 ఆన్‌లైన్ ద్వారా కట్టాడు. సాయంత్రానికి డబ్బు తిరిగి రాలేదు. ఫోన్ చేసేందుకు ప్రయత్నించగా ఎవరూ స్పందించలేదు. మోసపోయినట్టు గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్రెడిట్‌కార్డు బ్యాంక్‌కు లింక్ పేరిట మోసం

శ్రీనగర్‌కాలనీ కమలాపురి కాలనీకి చెందిన సయ్యద్ అవేజ్ అహ్మద్ మైక్రాం ఎలక్ట్రికల్ ఇండియాలో ఇంజనీర్. ఈనెల 13న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ఆయనకు చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డుకు కోటక్ బ్యాంక్‌కు అనుసంధానం చేయాలని విజ్ఞప్తి అందిందన్నారు. అనుసంధానం వద్దు అనుకుంటే దగ్గరలో ఉన్న బ్రాంచికి వెళ్లిగాని, మొబైల్ ద్వారా ఆపవచ్చని చెప్పారు. దీంతో అహ్మద్ మొబైల్ ద్వారా క్రెడిట్ కార్డు ఖాతాను తెరిచాడు. ఫోన్‌లో ఉన్న వారు చెప్పినట్టు వివరాలు పొందుపర్చగా అతడి క్రెడిట్ కార్డు నుంచి రూ.85,516 షాపింగ్ అయినట్టు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



పౌష్టికాహారం కిట్లను అందజేస్తున్న డాక్టర్ రాజేశం, డాక్టర్ చల్లా దేవి తదితరులు

టీబీ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

ఎర్రగడ్డ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా టీబీ రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు తెలంగాణ టీబీ విభాగం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం అన్నారు. గురువారం మారేడుపల్లి, చార్మినార్, జంగమ్మెట్, ఎర్రగడ్డ తదితర ప్రాంతాల్లోని టీబీ రోగులకు పౌష్టికాహారం కిట్లను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీబీ జిల్లా నియంత్రణ అధికారి డాక్టర్ డి.చల్లా దేవి మాట్లాడుతూ టీబీ వ్యాధి నయం చేసేందుకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. మందులను క్రమం తప్పకుండా వాడి పోషకాహారాన్ని తీసుకుంటే టీబీ పూర్తిగా నయమవుతుందని పేర్కొన్నారు. ప్లాన్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాలలో పౌష్టికాహారం కిట్లను అందజేస్తున్నట్లు తెలిపారు.

నేడు ప్రజావాణి రద్దు

బేగంపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రజాభవన్‌లో నేడు(శుక్రవారం) జరగాల్సిన ప్రజావాణిని రద్దు చేసినట్లు రాష్ట్ర నోడల్ అధికారి దివ్య దేవరాజన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడ్ ఫ్రైడే కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. వినతులు ఇవ్వదలచిన వారు ఈ నెల 22న(మంగళవారం) జరిగే ప్రజావాణికి రావాలని ఆమె సూచించారు.

మహిళల ఫొటోలు మార్ఫింగ్ చేసి..

సోషల్ మీడియాలో పోస్టు చేసిన గుర్తు తెలియని వ్యక్తి

బంజారాహిల్స్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కంపెనీ నిర్వాహకురాలు, ఉద్యోగి ఫొటోలను మార్ఫింగ్ చేసి అసభ్యకరంగా తయారు చేసి సోషల్ మీడియాలో పోస్టింగ్ చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదైంది. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 ఎమ్మెల్యే కాలనీలో నివాసం ఉండే ఓ మహిళ సాగర్ సొసైటీలో ఓ సంస్థ నిర్వహిస్తుంది. ఈనెల 14న ఆమె కార్యాలయానికి వచ్చి ఇన్‌స్టాగ్రామ్ చూస్తుండగా ఆమె ఫొటోలను మార్ఫింగ్ చేసి అసభ్యకరంగా పోస్టింగ్ చేసిన చిత్రాలు చూసింది. విచారించగా సంస్థలో పనిచేసే ఉద్యోగి ఫొటోలు కూడా ఇదేవిధంగా పోస్టింగ్ జరిగినట్లు తెలుసుకుంది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు గుర్తు తెలియని వ్యక్తిపై బీఎన్ఎస్ 295, 79, ఐటీఆర్ 67(ఏ) కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. తమ సంస్థలో పనిచేసిన మాజీ ఉద్యోగుల పనిఅయి ఉంటుందని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఫుట్‌పాత్‌పై పడుకున్న యువకుడిపై కత్తితో దాడి

● ఫోన్, డబ్బులు ఇవ్వకుంటే చంపేస్తా అంటూ బెదిరింపు

పంజాగుట్ట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట గ్రీన్‌ల్యాండ్స్ బస్టాప్‌లో పడుకున్న యువకుడి జేబు నుంచి సెల్‌ఫోన్, డబ్బులు దొంగిలించడానికి ఓ ఆగంతకుడు ప్రయత్నించాడు. యువకుడు అడ్డుకోవడంతో కత్తితో దాడి చేసి పారిపోయాడు. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున పంజాగుట్ట పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్‌కు చెందిన ఎన్.వినయ్ తల్లిదండ్రులు మరణించడంతో ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ కేటరింగ్ సర్వీస్ చేస్తుంటాడు. సంపాదన తక్కువ కావడం, హాస్టల్‌లో ఉంటే డబ్బులు ఎక్కువ అవుతుండడంతో రాత్రి వేళల్లో ఫుట్‌పాత్‌పై పడుకుంటాడు. ఎప్పటిలానే ఈనెల 16న రాత్రి గ్రీన్ ల్యాండ్ బస్టాప్‌లో పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో ఓ ఆగంతకుడు అక్కడికి వచ్చి డబ్బులు, ఫోన్ కోసం ప్యాంట్ జేబులు చెక్ చేస్తుండగా వినయ్‌కు మెళకువ వచ్చింది. ఏం చేస్తున్నావు... ఏం చేస్తున్నావు అంటూ అతడిని ప్రశ్నించగా నీ దగ్గర డబ్బులు ఎన్ని ఉన్నాయి, ఫోన్ ఉంటే వెంటనే ఇవ్వు అని బెదిరించాడు. తన వద్ద డబ్బులు లేవని వినయ్ చెప్పాడు. దీంతో ఆగంతకుడు కత్తి తీసి అతడి మెడపై పెట్టి డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తా అని మరోసారి బెదిరించాడు. అతడి ప్రయత్నాన్ని అడ్డుకునే క్రమంలో కత్తిని గట్టిగా పట్టుకుని బలంగా లాగడంతో వినయ్ అరచేతికి గాయమైంది. భయంతో ఐటీసీ కాకతీయ వైపు వినయ్ పరుగు పెట్టగా ఆగంతకుడు ద్విచక్రవాహనంపై అతడిని వెంబడించాడు. భయంతో వినయ్ గట్టిగా కేకలు వేయడంతో అటుగా వాహనంపై ఓ పోలీస్ కానిస్టేబుల్ రావడంతో ఆగంతకుడు సోమాజిగూడవైపు పారిపోయాడు. కానిస్టేబుల్ సహాయంతో వినయ్ పంజాగుట్ట పీఎస్‌కి వెళ్లి ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

యువకుల కొట్లాట.. 100కు సమాచారం

● అదుపులోకి తీసుకున్న పోలీసులు

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్‌లో తప్పుడు ఫొటోలు పోస్టు చేశారని ఐదుగురు యువకులు గొడవపడి కొట్లాడుకున్నారు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణకాంత్ పార్కు సమీపంలోని రెయిన్‌బో మెన్స్ హాస్టల్ వద్ద జరిగిన సంఘటనలో ఎల్.నవీన్ కుమార్ స్నేహితుడు సాయినాథ్‌కు ఫోన్ ద్వారా తప్పుడు ఫొటోలు పంపించాడని మందలించాడు. నవీన్ తన స్నేహితులైన బి.నాగార్జున, ఆర్.రవీంద్రనాథ్, సి.రామ్మోహన్ చౌదరిలను పిలిచాడు. వీళ్ల మధ్య మాటామాట పెరిగి ఘర్షణ పెరగడంతో రవీంద్రనాథ్ సాయినాథ్ పై కర్రతో దాడి చేశాడు. సాయినాథ్ అదే కర్రతో నాగర్జున తలపై కొట్టడంతో తలకు గాయమైంది. ఇదంతా చూస్తున్న స్థానికులు 100కు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు యువకులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ట్రావెల్స్ పేరిట రూ.70 వేలు మోసం

బోరబండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కుంభమేళాకు వెళ్లేందుకు ఆన్‌లైన్‌లో ప్రయత్నించి రూ.70వేలు మోసపోయిన వ్యక్తి ఉదంతమిది. బోరబండ పోలీసులు తెలిపిన ప్రకారం.. కళ్యాణ్‌నగర్ వెంచర్-3కి చెందిన కె.కోటిరెడ్డి ఫిబ్రవరి 15-19 మధ్య కుంభమేళా సందర్శనకు ఆన్‌లైన్‌లో సదరన్ ట్రావెల్స్‌కు బదులుగా సౌత్ ట్రావెల్స్‌ను సంప్రదించారు. ఫోన్ ద్వారా అపరిచిత వ్యక్తితో మాట్లాడి రూ.70వేలు చెల్లించారు. కొన్ని కారణాల వల్ల ప్రయాణం రద్దు చేసుకున్న కోటిరెడ్డికి సదరు వ్యక్తి డబ్బులు తిరిగి చెల్లించక పోగా, ఫోన్‌లోనూ స్పందించడం లేదు. ఇది సైబర్ మోసమని తెలుసుకున్న బాధితుడు బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వాహనం చోరీ

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పార్కు చేసిన అశోక్ లైలాండ్ వాహనం చోరీకి గురైంది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్మికనగర్‌కు చెందిన బి.వెంకటేష్ అశోక్ లైలాండ్(టీఎస్ 08 యూఎఫ్ 7238) వాహనాన్ని ఈ నెల 14న మధురానగర్ ఓర టవర్స్ వద్ద పార్కింగ్ చేశాడు. బుధవారం వెళ్లి వాహనాన్ని చూడగా కనిపించ లేదు. దీంతో వెంకటేష్ మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇద్దరు అదృశ్యం

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పలు కారణాలతో ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఇద్దరు అదృశ్యమయ్యారు. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రహ్మశంకర్‌నగర్‌కు చెందిన కె.దయాకర్(22) టీ తాగడానికి మంగళవారం బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో తండ్రి కె.బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ పీఆర్‌హిల్స్ కర్ణాటక చర్చి సమీపంలో నివసించే ఎన్.జానకి(38) గృహిణి. ఈనెల 14న భర్త సూరిబాబు స్వగ్రామానికి వెళ్లాడు. సూరిబాబు బావమరిదికి ఫోన్ చేసి అక్క ఊరికి వస్తుందని ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. మూడు రోజులైనా ఇంటికి వెళ్లకపోవడంతో సూరిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

మూతలు లేని ఫ్యూజ్ బాక్సులు ● పట్టించుకోని అధికారులు

మారేడుపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మారేడుపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఈస్ట్ మారేడుపల్లి షెనాయ్ గ్రౌండ్ చౌరస్తా వద్ద విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్లు కట్టడంతో ప్రమాదకరంగా మారాయి. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో పలు ప్రైవేటు సంస్థలు తీగల చుట్టలను స్తంభాలకు కడుతున్నారు. స్తంభాలకు కట్టేందుకు స్థలం లేకుంటే వాటి పక్కనే ఉన్న చెట్ల కొమ్మలకు కడుతున్నారు. దీంతో భారీగా గాలులు వీచినప్పుడు ఒక్కోసారి విద్యుత్ తీగలు, కేబుల్ వైర్లు కలిసి నిప్పురవ్వలు ఎగసిపడుతున్నాయి. ఇదే చౌరస్తాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెను నిర్మించకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. అదేవిధంగా వెస్ట్ మారేడుపల్లిలోని బ్యాంక్‌కాలనీలో క్రీడాకారులకు శిక్షణ ఇచ్చే ఆటస్థలం పక్కనే నాలుగు విద్యుత్ స్తంభాలు, రెండు ట్రాన్స్‌ఫార్మర్లకు కింది భాగంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ఫ్యూజ్ బాక్సులకు మూతలు లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. వారం క్రితం సికింద్రాబాద్ క్లబ్ సమీపంలోని వెల్లింగ్టన్ మార్గంలో అర్ధరాత్రి వీచిన ఈదురు గాలులకు ఫ్యూజ్‌బాక్స్‌లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి పెద్ద మంటలు ఎగిసిపడ్డాయి. రాత్రి సమయం కావడంతో పెనుముప్పు తప్పింది. దీంతో మూడు గంటల పాటు పరిసర ప్రాంతాలన్నీ చీకట్లో మగ్గాయి. విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలు, ప్రధాన రహదారులు, చౌరస్తాల్లో ఎక్కడ చూసిన ఇదే పరిస్థితి. ఉష్ణోగ్రతల వేడికి, అకాల వర్షాలు, ఈదురు గాలులకు ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. విద్యుత్ ఉన్నతాధికారులు విద్యుత్ స్తంభాలు, ఫ్యూజ్ బాక్సులు, ట్రాన్స్‌ఫార్మర్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఈస్ట్ మారేడుపల్లి, చౌరస్తాలో విద్యుత్ స్తంభానికి కేబుళ్లు


చౌరస్తాలో కంచ లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

పరిష్కరిస్తాం

మారేడుపల్లి కార్ఖానా పరిధిలో మూతలు లేని విద్యుత్ ఫ్యూజ్ బాక్సులు, విద్యుత్ స్తంభాలకు ప్రైవేటు సంస్థలు ఏర్పాటు చేసిన కేబుళ్లను పర్యవేక్షించి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటాం. **- విజయ్ కుమార్, ఏడీఈ**


బ్యాంక్ కాలనీలో మూతలు లేని ఫ్యూజ్ బాక్సులు


సెట్విన్ కార్యకలాపాలను పరిశీలిస్తున్న పద్మారావు గౌడ్

రాష్ట్రంలోనే మోడల్ కేంద్రంగా సీతాఫల్‌మండి సెట్విన్: పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండిలోని సెట్విన్ కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే మోడల్ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని, మరో రెండు అంతస్తుల్లో భవన సముదాయాన్ని నిర్మించి కొత్త ట్రేడ్‌లలో శిక్షణ కల్పిస్తామని సికింద్రాబాద్ శాసనసభ్యులు టి.పద్మారావుగౌడ్ తెలిపారు. గురువారం సెట్విన్ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులు, సిబ్బందితో ముచ్చటించారు. బ్యూటీషియన్, కంప్యూటర్, ఫ్యాషన్ డిజైనింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, మొబైల్ రిపేరింగ్, సీసీ కెమెరా రిపేరింగ్ విభాగాల కార్యకలాపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం సీతాఫల్‌మండిలో నెలకొల్పిన ఈ కేంద్రం ప్రత్యేకతను చాటుకుందని అన్నారు. త్వరలో దీని కార్యకలాపాలను మరింత విస్తరించనున్నట్టు వెల్లడించారు. కేంద్రం ఇన్‌చార్జి అనిత తదితర అధికారులు పాల్గొన్నారు.


ఈడీ కార్యాలయం ముందు మహాధర్నాకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి వెళ్లిన ఎమ్మెల్యే శ్రీగణేష్

కేంద్రం తీరు రాజకీయ ప్రతీకారమే

మారేడుపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఏఐసీసీ నాయకులు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ పేర్లను నేషనల్ హెరాల్డ్ కేసు చార్జ్‌షీట్‌లో ఈడీ చేర్చడానికి నిరసనగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హైదర్‌గూడ ఈడీ కార్యాలయం ముందు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ కార్యకర్తలతో కలిసి గురువారం ర్యాలీగా బయలు దేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ పార్టీకి, రాహుల్‌గాంధీకి వస్తున్న ప్రజాదరణను ఓర్వలేక బీజేపీ కక్ష సాధింపులకు దిగుతోందని ఆరోపించారు. బీజేపీని ప్రశ్నిస్తే కేసులు పెట్టి ప్రతీకార చర్యలకు దిగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శ్రీరామ ఆనంద్, సత్యనారాయణ, బద్రీనాథ్, సి.సంతోష్ యాదవ్, బలవంత్ రెడ్డి, సదా, సి.వైష్ణవి, సరిత, బొట్టు రాజు, రంగా రవీందర్ గుప్తా, కిరణ్ పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివెళ్లారు.

జై సంవిధాన్ పేరుతో కాంగ్రెస్ బూటకపు యాత్రలు

అడ్డగుట్ట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్‌ను కేంద్రమంత్రి అమిత్ షా అవమానించారని, ఆయనను కేంద్రమంత్రి వర్గం నుంచి తొలగించాలని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న పాదయాత్రలు వంద ఎలుకలను తిన్న పిల్లి తీర్థ యాత్రలు చేసినట్లుగా ఉందని బీజేపీ సీనియర్ నాయకురాలు, రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి ఆరోపించారు. గురువారం తుకారాంగేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను అవమానించి ప్రజాస్వామ్యాన్ని కాలరాసిన కాంగ్రెస్ పార్టీ చేసిన దేశద్రోహ చర్యలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. కాంగ్రెస్ హిందువులు లేని కాశ్మీర్‌ను తయారు చేసిందని, ఈశాన్య భారతదేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లో హిందువులను మైనార్టీలుగా చేసి అశాంతికి దారి తీసిందన్నారు.

క్రైమ్ సమాచారం

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు పిల్లలు, ఓ గృహిణి అదృశ్యం

● 24 గంటల్లో తల్లిదండ్రుల వద్దకు చేర్చిన పోలీసులు

మారేడుపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కార్ఖానా పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు మైనర్లు ఇంటి నుంచి పారిపోయి నల్లగొండలో ప్రత్యక్షమయ్యారు. కార్ఖానాకు చెందిన షిర్లీ క్రూజ్ తమ ఇద్దరు పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కార్ఖానా మాడపోటు నుంచి ఇద్దరు పిల్లలు ఎక్కడినుంచి ఎక్కడికి ఏ రోడ్డుపై వెళ్లారనేది దాదాపు వందల సీసీ ఫుటేజీలను పరిశీలించారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు 24 గంటల్లో ఇద్దరు మైనర్లు నల్గొండ గ్రామంలో ఉన్నట్లు సమాచారం తెలుసుకున్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో కార్ఖానా పోలీసుల బృందం నల్గొండకు వెళ్లి ఆ ఇద్దరు పిల్లలను తీసుకొని తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని 24 గంటల్లో ఇద్దరు పిల్లలు పట్టుకున్న కార్ఖానా పోలీసులకు పోలీస్ కమిషనర్ అభినందించి, నగదు రివార్డు అందించారు.

భర్తతో గొడవ పడి..


ఇందిర

బౌద్ధనగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో గృహిణి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం మల్కాజిగిరి ఈస్ట్ ఆనంద్‌బాగ్ ఎన్ఎండీసీ కాలనీకి చెందిన నీలగిరి ప్రసాద్, ఇందిర భార్యాభర్తలు. వీరికి భవ్యశ్రీ, పురంజయ ఇద్దరు పిల్లలు. ప్రసాద్ చిలకలగూడ ఎరుకలబస్తీలో బేబీ ఫ్యామిలీ క్లినిక్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఈ నెల 13వ తేదీన ఇందిర తన భర్తకు భోజనం తీసుకుని క్లినిక్‌కు వచ్చింది. సాయంత్రం వరకు అక్కడే ఉన్న ఇందిర భర్తతో గొడవ పడి.. తన సెల్‌ఫోన్‌ను క్లినిక్‌లో వదిలేసి బయటకు వెళ్ళిపోయింది. ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆమె తల్లి సన్నిహితులు, బంధుమిత్రులను వాకబు చేసింది. పలు ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఇందిర తల్లి మల్లీశ్వరి గురువారం పోలీసులను ఆశ్రయించింది. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మృతి


ఇందిర

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రైలు ఢీకొన్న ఓ వృద్ధుడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించిన ఘటన బొల్లారం రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు వివరాల ప్రకారం బొల్లారం - గుండ్లపోచంపల్లి రైల్వేస్టేషన్ మార్గమధ్యలో గురువారం గుర్తుతెలియని 70 ఏళ్ల వృద్ధుడిని రైలు ఢీకొట్టడంతో రైలు పట్టాలపై తీవ్రగాయాలతో పడిపోయాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు వైద్య పరీక్షల నిమిత్తం గాంధీకి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మరణించాడు. మృతుడి జేబులో సికింద్రాబాద్ నుంచి గుండ్లపోచంపల్లికి టికెట్ ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు గాంధీ మార్చురీకి తరలించారు. వృద్ధుడి ఆచూకీ తెలిస్తే 9666280808 నంబరుకు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు. కేసు నమోదు చేసుకున్న దర్యాప్తు చేస్తున్నారు.

సికింద్రాబాద్‌లో..


ఇందిర

అడ్డగుట్ట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మాధవి వివరాల ప్రకారం సికింద్రాబాద్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ రోడ్డు వద్ద గుర్తుతెలియని 50ఏళ్ల వృద్ధుడు చనిపోయి ఉండడంతో సమాచారం అందుకున్న గోపాలపురం పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. వృద్ధుడి ఆచూకీ తెలిస్తే గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ పాలనలో విసిగిపోయిన ప్రజలు


బీఆర్ఎస్ శ్రేణులనుద్దేశించి మాట్లాడుతున్న పద్మారావు

సికింద్రాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ 16 నెలల పాలనలో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారని, బీఆర్ఎస్ పాలనను మళ్లీ కోరుకుంటున్నారని సికింద్రాబాద్ శాసనసభ్యుడు టి.పద్మారావుగౌడ్ అన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటానికి పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీతాఫల్‌మండిలో గురువారం జరిగిన సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాధనే ధ్యేయంగా బీఆర్ఎస్ పుట్టి 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా పార్టీ పండుగను ఈ నెల 27న ఘనంగా జరుపుకుందామని కోరారు. వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో పదిలక్షల మందితో నిర్వహించే బహిరంగ సభకు పెద్దఎత్తున తరలివచ్చి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అడ్డగుట్ట, తార్నాక, మెట్టుగూడ, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్ల నుంచి భారీగా వాహనాల్లో తరలిరావాలని, తాను కూడా జనంతోనే ఉంటానని పద్మారావు చెప్పారు. కార్పొరేటర్లు కంది శైలజ, లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్, సామల హేమ, రాసూరి సునీత, నాయకులు ఆలకుంట హరి, కరాటే రాజు, కంది నారాయణ, గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, రాజసుందర్ తదితరులు పాల్గొన్నారు.


గాంధీ వైద్యుల అసోసియేషన్ సభ్యులు

ప్రశాంతంగా కౌన్సిల్ సభ్యుల ఎన్నిక

అడ్డగుట్ట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి యూనిట్‌లో ఇటీవల ఖాళీ అయిన ప్రొఫెసర్ క్యాడర్, అసోసియేట్ క్యాడర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ క్యాడర్ పోస్టులకు గురువారం ఎన్నికలు విజయవంతంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం నాలుగు వరకు పోలింగ్ జరగ్గా ఐదు గంటలకు ఓట్ల లెక్కింపు పూర్తి అయింది. ఈ క్రమంలో కౌన్సిల్ సభ్యులుగా గాంధీ ఆస్పత్రి డాక్టర్ సుభోద్, డాక్టర్ రాజేశ్‌లు విజేతలుగా నిలిచారు. అదేవిధంగా అసోసియేట్ అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ క్యాడర్లకు జనరల్ కౌన్సిల్ సభ్యుల పోస్టుకు డాక్టర్ రాజేష్, డాక్టర్ కల్యాణ చక్రవర్తి, డాక్టర్ కృష్ణా నాయక్, డాక్టర్ లక్ష్మీ కాంత్‌రెడ్డిలు పోటీ పడగా జనరల్ సర్జరీ విభాగం ప్రొఫెసర్ రాజేష్ ఎన్నికల్లో గెలిచినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ ఆవుల మురళీధర్ తెలిపారు. ఈ ఎన్నికలు గాంధీ యూనిట్ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ భూపేందర్‌సింగ్ రాథోడ్ ఆధ్వర్యంలో జరిగాయి. యూనిట్ కార్యదర్శులు డాక్టర్ అబ్బయ్య , కోశాధికారిగా డాక్టర్ రవిలు పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన ప్రొఫెసర్లు సుభోద్, రాజేష్‌లకు వైద్యులు శుభాకాంక్షలు తెలిపారు.


ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్‌ను కలిసిన యాదవ సంఘం నేతలు

యాదవుల హక్కుల సాధనకు కృషి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : యాదవుల అభివృద్ధి, హక్కుల సాధన కోసం కృషి చేస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఇటీవల సనత్‌నగర్ నియోజకవర్గ యాదవ సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన గెలుబోయిన కుమార్ యాదవ్, పలువురు యాదవ సంఘం నేతలు గురువారం వెస్ట్ మారేడుపల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుమార్‌ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. యాదవ సంఘం నాయకులు రాములు యాదవ్, సత్యనారాయణ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, బాలేష్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, కిషోర్ యాదవ్, రఘు యాదవ్, మధు యాదవ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు లక్ష్మీపతి, ప్రేమ్ కుమార్, అరుణ్ గౌడ్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

ప్రత్యామ్నాయ మార్గంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలి

సికింద్రాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్యారడైజ్ నుంచి డైరీ ఫారం రోడ్డు వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టును ప్రత్యామ్నాయ మార్గం ద్వారా నిర్మించాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, మాజీ సభ్యుడు కె.పాండుయాదవ్‌లు కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆయనను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బాలంరాయి చౌరస్తా నుంచి ప్రతిపాదించిన టన్నెల్ మార్గం తాడ్‌బండ్ ముస్లిం శ్మశాన వాటిక వద్ద ముగుస్తుందని, అలా కాకుండా ఎడమవైపు నుంచి ముస్లిం శ్మశాన వాటిక వెనుక నుంచి ఓల్డ్ ఎయిర్‌పోర్టు రన్ వే వరకు టన్నెల్‌ను కొనసాగించాలని కోరారు. అదేవిధంగా అక్కడ ఫ్లైఓవర్ ప్రారంభించి బోయిన్‌పల్లి చౌరస్తా మీదుగా డైరీ ఫారం వరకు నిర్మించాలని కోరారు. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో ఉన్న బడుగు, బలహీనవర్గాల ప్రజలకు నష్టనివారణ తగ్గడంతోపాటు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. కారిడార్‌ను 200 అడుగులకు కాకుండా 150 అడుగుల వెడల్పుకు కుదించాలన్నారు. తద్వారా ప్రార్థనా మందిరాలను తొలగించకుండా కాపాడుకోవచ్చని జక్కుల సూచించారు. దీనివల్ల ప్రభుత్వం చెల్లించాల్సిన నష్టపరిహారం, ప్రాజెక్టుపై భారం కూడా తగ్గుతుందని అభిప్రాయపడ్డారు.


మధుకర్ నాయక్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న జక్కుల మహేశ్వర్‌రెడ్డి, పాండుయాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న బేగంపేట కార్పొరేటర్ టి. మహేశ్వరి

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి

బేగంపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో నిర్వహించ తలపెట్టిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం బీఆర్ఎస్ పార్టీ బేగంపేట డివిజన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్క బీఆర్ఎస్ కార్యకర్త ఈ సభలో పాల్గొనాలన్నారు. అమలు కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. 15 నెలలకే ప్రజలు కాంగ్రెస్ పాలనపై విసుగు చెందారన్నారు. తొలుత ఇటీవల మరణించిన బీఆర్ఎస్ సీనియర్ నేత సత్యనారాయణకు సంతాపం తెలిపారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు డి.వి.నరేందర్‌రావు, టి.శ్రీహరి, పాటిగడ్డ గిరి, శ్యామ్‌సుందర్, మొయినుద్దీన్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

చెత్త కుప్పలను తొలగించాలి

బేగంపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. వీటిని తొలగించాల్సిన జీహెచ్ఎంసీ సిబ్బంది పట్టించుకోపోవడంతో ఏ రహదారిలో చూసిన చెత్త పేరుకుపోయి దర్శనమిస్తుంది. శ్యామల కుంట వెళ్లే దారితో పాటు సనత్‌నగర్ హనుమాన్ ఆలయం వెళ్లే రహదారిలో ఇదే పరిస్థితి. స్థానికులు సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పలువురు తెలిపారు. ఇప్పటికైనా శానిటేషన్ అధికారులు చొరవ తీసుకొని రహదారుల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


సనత్‌నగర్ సెవెన్ టెంపుల్స్ రోడ్డులో తొలగించని చెత్త

ప్రతిపక్షాలను అణిచి వేసేందుకు కేసులు

బేగంపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కడమే కేంద్రం పరిపాలనగా సాగుతోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ విమర్శించారు. కాంగ్రెస్‌పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలను చార్జ్ షీట్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ ఏఐసీసీ పిలుపుమేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం వద్ద గురువారం జరిగిన ధర్నాలో కోట నీలిమ పాల్గొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో జరిగిన ధర్నాలో రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో పాటు మంత్రులు, పార్టీ నేతలు భారీగా పాల్గొన్నారు.

అమర్‌నాథ్ యాత్రికులకు గాంధీలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ

అడ్డగుట్ట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అమర్‌నాథ్ యాత్రికులకు గాంధీ ఆస్పత్రిలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ నెల 21 నుంచి ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో ఉదయం 10.30 నుంచి గాంధీ ఆస్పత్రి మొదటి అంతస్తులోని మెడికల్ రికార్డు డిపార్ట్‌మెంట్(ఎంఆర్‌డీ) కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు రక్త పరీక్షలు, ఛాతి ఎక్స్‌రే, బ్లడ్ గ్రూప్ మెడికల్ రిపోర్టులను తీసుకొచ్చి ఈ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం యాత్రికులకు మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తామని వైద్యులు సూచించారు ఈ సెంటర్‌లో డాక్టర్ కిరణ్(ఆర్థోపెడిక్), డాక్టర్ జగదీశ్వర్ రెడ్డి(కార్డియాలజీ), డాక్టర్ భానుప్రియ(పల్మొనాలజీ). డాక్టర్ కృష్ణ నాయక్(జనరల్ మెడిసిన్)లు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కోసం విధులు నిర్వహిస్తారు. సర్టిఫికెట్ల జారీ పూర్తిగా ఉచితంగానే అందిస్తామని వైద్యులు ప్రకటించారు.


చలివేంద్రాన్ని ప్రారంభించిన కార్మికశాఖ అధికారులు

తుకారాంగేట్‌లో చలివేంద్రం ప్రారంభం

అడ్డగుట్ట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : తుకారాంగేట్ చౌరస్తాలో గురువారం తెలంగాణ ప్రభుత్వ కార్మికశాఖ అధికారులు ఎం.నిష్మిత, మయూరి, జ్యోతి, అబ్దుల్ చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల దాహార్తిని తీర్చేందుకు కూలీల అడ్డాల వద్ద ప్రారంభించామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సిఐటీయూ సికింద్రాబాద్ జోన్ నాయకులు ఆర్.మల్లేష్, గోపాల్‌తో పాటు రమ, రాజ్యలక్ష్మి, రాము. సాయిలు పాల్గొన్నారు.


ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపల్ అనురాధ పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ ఐఓఎస్ అధికారి మదన్ మోహన్

ప్రిన్సిపాల్‌కు ఉద్యోగ విరమణ వీడ్కోలు

అడ్డగుట్ట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్ట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపాల్ అనురాధ పదవీ విరమణ సందర్భంగా గురువారం మారేడుపల్లి మండల డిప్యూటీ ఐఓఎస్ అధికారి మదన్‌మోహన్ పాల్గొన్నారు. ఆనాటి జ్ఞాపకాలను, అనుభవాలను తోటి టీచర్లు పంచుకున్నారు. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని తెలుపుతూ శుభాకాంక్షలు తెలిపి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లు పాల్గొన్నారు. అనంతరం ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు ప్రిన్సిపాల్ అనురాధకు శుభాకాంక్షలు తెలిపారు.


సర్వేపల్లి రాధాకృష్ణకు నివాళులర్పిస్తున్న భాణుక నర్మద

సర్వేపల్లికి బాణుక నర్మద నివాళి

తిరుమలగిరి ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష వర్ధంతిని పురస్కరించుకుని గురువారం టీచర్స్ కాలనీలోని ఆయన విగ్రహానికి కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భాణుక నర్మద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు భిక్షపతి రెడ్డి, సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, మోహన్‌రెడ్డి వార్డు బీజేపి అధ్యక్షుడు పవన్, ఇన్‌చార్జి ప్రశాంత్, మంజుల, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ

పద్మారావునగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఎన్‌టీపీసీ దక్షిణ ప్రాంత కేంద్ర కార్యాలయం ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్)లో భాగంగా 675 మంది విద్యార్థులకు స్కూలు బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎన్‌టీపీసీ జనరల్ మేనేజర్ సూర్యనారాయణ పాణిగ్రహి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అఖిల్ పట్నాయక్, మేనేజర్ ప్రియాంక భూయాన్, దూద్‌బావి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఎన్‌టీపీసీ అధికారులకు హెచ్ఎం స్వరూప కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ప్రజావాణి రద్దు

బేగంపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఏప్రిల్ 18న(శుక్రవారం) జరగాల్సిన ప్రజావాణిని రద్దు చేసినట్లు రాష్ట్ర నోడల్ అధికారి దివ్య దేవరాజన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న గుడ్ ఫ్రైడే కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. వినతులు ఇవ్వదలచిన వారు 22న(మంగళవారం) జరిగే ప్రజావాణికి రావాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | జి.అంజయ్య: 9985921364